నాడు అమెరికాకు తలొగ్గని ఇందిర

పాకిస్థాన్ వ్యవహారాల్లో జోక్యం మానుకోకుంటే గుణపాఠం చెబుతామన్న అమెరికా అధ్యక్షుడు నిక్సన్

మాకు అమెరికా యజమాని కాదని తెగేసి చెప్పిన ఇందిర

1971నాటి యుద్ధ సమయంలో ఆసక్తికర ఘటన

న్యూఢిల్లీ: అది మార్చి, 1971.. పాకిస్థానీ నియంత పాలనకు వ్యతిరేకంగా విముక్తి పోరాటం సాగిస్తున్న బెంగాలీలపై పాకిస్థానీ సైన్యం ఆపరేషన్ సెర్చ్‌లైట్ పేరిట దారుణ మారణకాండ సాగిస్తున్న కాలం.. స్వతంత్ర బంగ్లాదేశ్ పోరాటానికి భారత ప్రభుత్వం అండగా నిలిచింది. పాకిస్థాన్‌తో సన్నిహితంగా ఉంటున్న అమెరికాకు ఇది నచ్చలేదు. పాకిస్థాన్ అంతరంగిక వ్యవహారాలలో భారత జోక్యాన్ని వ్యతిరేకిస్తూ అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ భారత ప్రధాని ఇందిరా గాంధీకి లేఖ రాశారు. దీనికి దీటుగా జవాబిచ్చిన ఇందిరాగాంధీ 1971 నవంబర్‌లో అమెరికాను సందర్శించారు. వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్‌తో ఇందిరాగాంధీ భేటీ అయ్యారు. ఆ సందర్భంగా పాకిస్థాన్ వ్యవహారాల్లో భారతదేశ జోక్యాన్ని నిక్సన్ తీవ్రంగా నిరసించారు. 'పాక్ వ్యవహారాల్లో జోక్యం మానుకోకుంటే భారత్‌కు తగిన గుణపాఠం చెబుతాం' అంటూ నిక్సన్ నేరుగా ఇందిరా గాంధీనే హెచ్చరించే ప్రయత్నం చేశారు. ఈ బెదిరింపులను ఏమాత్రం లెక్కచేయని ఇందిరా గాంధీ ఆయనకు అంతే దీటుగా సమాధానమిచ్చారు. 'భారత్ అమెరికాను ఓ మిత్రుడిగా చూస్తుందే తప్ప యజమానిగా కాదు. తన భవిష్యత్తును రచించుకునే సామర్థ్యం భారత్‌కు ఉంది. పరిస్థితులను బట్టి ఎవరితతో ఎలా వ్యవహరించుకోవాలో మాకు తెలుసు' అంటూ నిక్సన్‌కు సూటిగా, విస్పష్టంగా చెప్పి వైట్ హౌస్ నుంచి ఇందిర బయటకు వచ్చేశారు. వైట్‌హౌస్‌లో అధ్యక్షుడితో కలసి నిర్వహించాల్సిన సంయుక్త విలేకరుల సమావేశాన్ని సైతం ఇందిర బహిష్కరించారు. ఇందిరా గాంధీకి వీడ్కోలు పలికేందుకు కారు వద్దకు పరుగుత్తుకు వెళ్లిన విదేశాంగ మంత్రి హెన్రీ కిసింజర్, 'మేడమ్ ప్రైమ్ మినిస్టర్. అధ్యక్షుడితో మాట్లాడేటప్పుడు కొంత సంయమనం పాటించాలని మీకు తెలియదా?' అని ప్రశ్నించారు. దీనికి ఇందిరాగాంధీ బదులిస్తూ, 'మీ అమూల్యమైన సలహాకు ధన్యవాదాలు. అభివృద్ధి చెందుతున్న దేశంగా మా వెన్నెముక నిటారుగా నిలబడి ఉంటుంది. అన్ని అరాచకాలను ఎదుర్కొనే వనరులు మాకు ఉన్నాయి. వేల మైళ్ల దూరం నుంచి ఏదో ఓ శక్తి పాలించే, తరచు నియంత్రించే రోజులు గతించాయని మేము నిరూపిస్తాం' అని కటువుగా చెప్పారు. ఇదే విషయాన్ని కిసింజర్ తన ఆత్మకథలో రాసుకున్నారు. మరోవైపు, భారత్‌ను బెదిరించేందుకు పాక్‌కు మద్దతుగా యూఎస్ఎస్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌ను బంగాళాఖాతానికి అమెరికా పంపింది. అయినా ఇందిర బెదరలేదు. కాగా, 1971 డిసెంబర్ 18న అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ ఇందిరా గాంధీకి ఒక లేఖ రాస్తూ, భారత్‌ను ఆసియా ఖండంలో ప్రధాన శక్తిగా అమెరికా గుర్తిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామిక ప్రభుత్వ ఉమ్మడి విలువలను తాము కూడా పంచుకుంటామని చెప్పారు. తమ రెండు గొప్ప దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినాలని తాను కోరుకోవడం లేదని పేర్కొన్నారు. ఆసియాలో సుస్థిరత కోసం తమ రెండు దేశాలు కలసి పనిచేసే రోజు వస్తుందని తాను ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. దక్షిణాసియాలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాల పట్ల తాను చింతిస్తున్నానని, త్వరలోనే సుస్థిరత నెలకొనగలదని ఆశిస్తున్నానని నిక్సన్ తెలిపారు. ఈ లేఖను బట్టి తనను ఢీకొన్న భారతదేశ ప్రధాని పట్ల అమెరికా అధ్యక్షుడు నిక్సన్ ఎలా తలొగ్గిందీ స్పష్టమవుతున్నది.

మిస్రీపై ట్రోలింగ్

- తీవ్రంగా ఖండించిన నేతలు
- బాధ్యులపై చర్యలకు దౌత్యవేత్తల సంఘం డిమాండ్

న్యూఢిల్లీ: భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం ముగిసి కాల్పుల విరమణకు ఒప్పందం కుదిరిందని శనివారం మధ్యాహ్నం ఇలా ప్రకటించారో లేదో, యుద్ధం ద్వారా పాకిస్థాన్ పీచమణచాలని కోరుకుంటున్న పలువురు పౌరులు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీపై సామాజిక మాధ్యమంలో పెద్దయెత్తున ట్రోలింగ్‌ను ప్రారంభించారు. ఈ ట్రోలింగ్‌లో విదేశాల్లో ఉన్న అమె కుమార్తెను కూడా లాగి కొందరు దారుణమైన వ్యాఖ్యలు చేశారు. ఈ ట్రోలింగ్‌ను తట్టుకోలేక ఆయన తన అకౌంట్‌ను లాక్ చేసుకున్నారు. కాగా, మిస్రీకి రాజకీయే నేతలు అఖిలేశ్ యాదవ్, అసదుద్దీన్ ఒవైసీ సహా పలువురు దౌత్యవేత్తలు మద్దతు తెలిపారు. మిస్రీని ఆయన కుటుంబాన్ని, ముఖ్యంగా ఆయన కుమార్తెను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమంలో పలువురు ట్రోలింగ్ చేయడాన్ని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ తీవ్రంగా ఖండించారు. ఇది భయంకరమైనది, ఎంతమాత్రం ఆమోదయోగ్యం కానిదంటూ ఢిల్లీ కేంద్రంగా ఉన్న భారత దౌత్యవేత్తల సంఘం పేర్కొంది. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. నెటిజన్ల వ్యాఖ్యలు దేశం కోసం అహర్నిశలు పాటు పడుతున్న నిజాయితీ గల అధికారుల ఆత్మస్థైర్యం దెబ్బతీస్తాయని అఖిలేశ్ యాదవ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇలాంటి ప్రధాన నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం తీసుకుంటుందే తప్ప వ్యక్తిగతంగా అధికారులు తీసుకున్నవి కావన్న విషయాన్ని గుర్తించాలన్నారు. కొందరు నెటిజన్లు తమ హద్దులు దాటి మిస్రీని, ఆయన కుటుంబ సభ్యులను దారుణంగా ట్రోలింగ్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇది నిజంగా అవమానకరమని అన్నారు. రాజకీయంగా, కార్యనిర్వాహకంగా తీసుకునే నిర్ణయాలపై ఒక నిజాయితీ గల అధికారిని విమర్శించడం తగదని ఒవైసీ అన్నారు.

సిమ్లా స్ఫూర్తికి కేంద్రం తూట్లు!

- కశ్మీర్ అంశంపై మూడో పక్షం జోక్యం!
- ట్రంప్ 'మధ్యవర్తిత్వం'పై విమర్శలు
- మోదీ సర్కారును నిలదీస్తున్న విపక్షాలు

1972 జూలై 2న సిమ్లా ఒప్పందంపై సంతకాలు చేస్తున్న ఆనాటి భారత ప్రధాని ఇందిరా గాంధీ, పాకిస్థాన్ అధ్యక్షుడు జుల్ఫీకర్ అలీ భుట్టో

న్యూఢిల్లీ: కశ్మీర్ విషయంలో మూడో పక్షం జోక్యం ఉండరాదనే సిమ్లా ఒప్పందం స్ఫూర్తికి కేంద్రంలోని బీజేపీ సర్కారు తూట్లు పొడిచిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 1971 భారత్ పాక్ యుద్ధంలో పాక్ శరణాగతి తర్వాత 1972 జులై 2న హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో ఇరు దేశాల ప్రధానులు సమావేశమై ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. దీన్నే చారిత్రక సిమ్లా ఒప్పందంగా పిలుస్తారు. దీని ప్రకారం భారత్ పాక్ మధ్య తలెత్తే ఏ విబేదమైనా, వివాదమైనా శాంతియుత వాతావరణంలో ద్వైపాక్షిక చర్చల ద్వారా మాత్రమే పరిష్కరించుకోవాలి. ఇందులో మూడో దేశం లేదా వ్యక్తుల ప్రమేయం లేదా బాగస్వామ్యం కానీ అంగీకరించరాదు. ఇరు దేశాల నాయకులు దీనికి అంగీకరించి సంతకాలు చేశారు. ఈ ఒప్పందం కారణంగానే కశ్మీర్ సమస్య అంశంలో ఇంతవరకూ ఏనాడూ ఐక్యరాజ్య సమితితో పాటు ఏ దేశమూ జోక్యం చేసుకోలేదు. తాజాగా అమెరికా అధ్యక్షుడి ప్రకటనతో కశ్మీర్ వివాదాన్ని అంతర్జాతీయ సమాజం ముందు పెట్టినట్టయింది. భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక ప్రకటన చేయడం, అందులో కశ్మీర్ వివాదం పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహిస్తానని పేర్కొనడం ఏడు దశాబ్దాల భారత దౌత్య విధానానికి తీవ్ర విఘాతమని విద్యావేత్తలు మేధావులు అంటున్నారు. ప్రతిపక్షాలు ట్రంప్ ప్రకటనపై తీవ్రంగా మండిపడుతున్నాయి. ఇది మన దేశ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకోవడమేనని, మన సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టడమేనని అంటున్నాయి. దశాబ్దాల తరబడి భారత్ నెరిపిన దౌత్యనీతిని మోదీ మంటగలుపుతున్నారని ధ్వజమెత్తుతున్నాయి. ఈ విషయమై వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, లేదా పార్లమెంట్ ప్రత్యేక సమావేశం నిర్వహించి కేంద్రం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి.

అసలేమిటీ సిమ్లా ఒప్పందం?

భారత్, పాకిస్థాన్ మధ్య 1971 యుద్ధం, బంగ్లాదేశ్ అవతరణ అనంతరం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు సడలించి స్నేహపూర్వక సంబంధాలు ఏర్పరిచే లక్ష్యంతో 1972 జులై 2న హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో రెండు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందంపై ఆనాటి భారత ప్రధాని ఇందిరా గాంధీ, పాకిస్థాన్ అధ్యక్షుడు జుల్ఫికర్ అలీ భుట్టో సంతకాలు చేశారు. ఇరు దేశాల పార్లమెంట్‌లలో ఆమోదం పొందిన తర్వాత అదే ఏడాది ఆగస్టు 4వ తేదీ నుంచి ఈ ఒప్పందం అమలులోకి వచ్చింది. ఇరు దేశాలు కాల్పుల విరమణ పాటించాలని, భవిష్యత్తులో ఏవైనా విభేదాలు తలెత్తినా వాటిని శాంతియుతంగా, ద్వైపాక్షిక చర్చలు, పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని, అందులో మూడో పక్షం జోక్యానికి అవకాశం ఇవ్వకూడదనేది ఈ ఒప్పందం ప్రధానాంశం. అమెరికా అధ్యక్షుడి ప్రకటన, దానిపై భారత్ మౌనం నేపథ్యంలో సిమ్లా ఒప్పందం స్ఫూర్తికి మోడీ ప్రభుత్వం మంగళం పాడినట్టేనా? అనేది ప్రశ్న తలెత్తుతుంది.

ఉగ్రవాదంపైనే మా పోరు

- వారికి బుద్ధి చెప్పడానికే ఆపరేషన్ సిందూర్
- ఉగ్రవాదులకు అండగా పాక్
- పరిణామాలకు వాళ్లదే బాధ్యత
- మన దేశీయ రక్షణ వ్యవస్థ భేష్
- భారత డీజీఎంవోలు వెల్లడి

న్యూఢిల్లీ, మే 12: ఆపరేషన్ సిందూర్‌తో భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన దాడులు, అనంతరం కాల్పుల విరమణకు ఒప్పందం జరిగిన నేపథ్యంలో సోమవారం త్రివిధ దళాల డీజీఎంవోలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిందూర్ ఆపరేషన్ గురించి వారు మీడియాకు వివరించారు. 'ఉగ్రవాదులతోనే మా పోరాటం, ఉగ్రవాదులు, వారికి సహాయం చేసే వారికి బుద్ధి చెప్పడానికే ఆపరేషన్ సిందూర్ నిర్వహించాం. కానీ పాకిస్థాన్ తమపై దాడి చేస్తున్నామని భావిస్తున్నది. ఉగ్రవాదులకు అండగా నిలుస్తున్నది. ప్రస్తుతం పాకిస్థాన్ ఎదుర్కొంటున్న పరిణామాలకు ఆ దేశమే పూర్తి బాధ్యత వహించాలి' అని ఎయిర్ మార్షల్ ఏకే భార్తి స్పష్టం చేశారు. 'మా పోరాటం ఉగ్రవాదులు, వారి మౌలిక సదుపాయాలపైనే. అయితే ఉగ్రవాదుల కోసం పాకిస్థాన్ మిలిటరీ జోక్యం చేసుకోవడం నిజంగా జాలిగొలిపే విషయం. అందుకే దానిపై స్పందించాలని మేం నిర్ణయించుకున్నాం' అని ఆయన అన్నారు.

పాక్ దాడులను సమర్థంగా తిప్పికొట్టాం

అంబ్రెల్లా ఆపరేషన్ కింద ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా వైమానిక, ఇతర దళాల సమన్వయంతో సరిహద్దు వెంబడి ఉన్న తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకున్నామని ఏకే భార్తి తెలిపారు. 'ఈ యుద్ధంలో పాక్ వివిధ రకాల డ్రోన్లను వినియోగించింది. దేశీయంగా తయారు చేసిన గగనతల రక్షణ వ్యవస్థ ద్వారా వాటిని సమర్థంగా అడ్డుకున్నాం. చైనాలో తయారు చేసిన పీ-15 క్షిపణులతో పాక్ దాడి చేసింది. వాటిని ఆకాశ్ క్షిపణులతో అడ్డుకుని కూల్చేశాం. పాకిస్థాన్‌లోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌పై భారత్ దాడి చేసి పూర్తిగా దానిని ధ్వంసం చేసింది. మన వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ దాడులు చేసినా దానిని అడ్డుకోవడంతో పాకిస్థాన్ నిస్సహాయంగా ఉండి పోయింది' అని వివరించారు. భారత్ చేసిన దాడుల్లో దేశీయ పరిజ్ఞానంతో తయారు చేసిన ఆకాశ్ వైమానిక రక్షణ వ్యవస్థ అద్భుతమైన పనితీరును కనబర్చిందని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా భారత వైమానిక దళం వివిధ లక్ష్యాలను ఛేదించిన దృశ్యాలను మీడియా సమావేశంలో ప్రదర్శించారు. అలాగే పాకిస్థాన్ వినియోగించిన అంతరిక్షం నుంచి అంతరిక్షానికి ప్రయోగించే పీఎల్-15 క్షిపణి ధ్వంసం అనంతరం పడ్డ శకలాలను కూడా వారు చూపించారు.

కోహ్లీ రిటైర్మెంట్ గురించి ప్రస్తావన

డీజీఎంఓ లెఫ్ట్‌నెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ మాట్లాడుతూ 'మన వైమానిక క్షేత్రాలు, లాజిస్టిక్‌లను లక్ష్యంగా చేసుకోవడం చాలా కష్టం, మీరు అన్ని పొరలను దాటి వచ్చినప్పటికీ ఈ గ్రిడ్ వ్యవస్థ యొక్క పొర మిమ్మల్ని తాకుతుందని' హెచ్చరించారు. భారత్ ఇప్పటిక శాంతికి కట్టుబడి ఉందని, అయితే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే దాడికి ఏమాత్రం వెనుకాడదని హెచ్చరించారు. ఈ సందర్భంగా భారత్ స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ రిటైర్‌మెంట్ ప్రస్తావన తెచ్చారు. మన ఎయిర్ డిఫెన్స్ సామర్థ్యాన్ని నాటి ఆస్ట్రేలియా క్రికెట్ బౌలర్లు లిల్లీ, థాంప్సన్‌లతో పోల్చారు.

ట్రంప్‌కు బెదరని ఉక్రెయిన్ అధ్యక్షుడు

- వైట్‌హౌజ్‌లో నాడు వాగ్యుద్ధం
- అమెరికా అధ్యక్షుడికి దీటుగా జవాబు

న్యూఢిల్లీ: అది ఫిబ్రవరి 28, 2025. రెండవసారి అధికారం చేపట్టిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియా సాక్షిగా తన ఆధిపత్య లక్షణాలను బయట పెట్టుకోగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ బలంగా ఆయనను ఎదుర్కొన్నారు. ట్రంప్ దురుసు వ్యాఖ్యలకు ఆయన దీటుగా బదులిచ్చారు. ఖనిజ ఒప్పందం కుదుర్చుకోవలసిన సందర్భం కాస్తా రసాభాసగా మారిపోయింది. ఉక్రెయిన్-రష్యా యుద్ధం అంతానికి అమెరికా జోక్యం చేసుకోవాలని కోరడానికి వచ్చిన జెలెన్‌స్కీతో ట్రంప్ ఢీకొన్నారు. జెలెన్‌స్కీకి స్వాగతం పలుకుతూ ప్రసంగం ప్రారంభించిన ట్రంప్ ప్రసంగానికి అడ్డుపడిన జెలెన్‌స్కీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌ని హంతకుడిగా అభివర్ణించారు. ట్రంప్‌కు కొన్ని ఫొటోలు చూపిస్తూ అవన్నీ ఉక్రెయిన్ ప్రజల పట్ల రష్యా చేసిన అకృత్యాలని అన్నారు. అయితే దీన్ని పట్టించుకోకుండా ప్రసంగాన్ని కొనసాగించిన ట్రంప్ పుతిన్‌తో కూడా తాను మాట్లాడానని, రష్యా రెండోసారి దాడి చేయదని తాను నమ్ముతున్నానని అన్నారు. ఇంతలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ జోక్యం చేసుకుంటూ శాంతి స్థాపన కోసం గత బైడెన్ ప్రభుత్వం తీసుకున్న వైఖరి సరిగ్గా లేదని విమర్శించారు. రష్యాను చర్చల వేదిక వద్దకు తెచ్చేందుకు ట్రంప్ ప్రభుత్వం దౌత్యాన్ని ప్రదర్శిస్తోందంటూ వాన్స్ చెప్పారు. దీంతో మండిపడిన జెలెన్‌స్కీ.. పుతిన్‌ను అమెరికా ఇప్పటివరకు అడ్డుకోలేదని చెబుతూ 'ఏ రకమైన దౌత్యాన్ని గురించి మీరు మాట్లాడుతున్నారు జేడీ?' అని ప్రశ్నించారు. రష్యా ప్రభావాన్ని అమెరికా ఇప్పుడు గుర్తించే పరిస్థితిలో లేదని, భవిష్యత్తులో అమెరికాకూ అనుభవంలోకి వస్తుందని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. మీ దేశం పెద్ద సమస్యలో ఉంది అని ట్రంప్ చెబుతుండగా తాను జవాబిస్తానని జెలెన్‌స్కీ అన్నారు. "వద్దు వద్దు. ఇప్పటికే మీరు చాలా మాట్లాడారు. మీరు గెలవడం లేదు. మా సాయంతోనే మీరు గట్టి పోరాటం చేశారు. మేం లేకపోతే మీరు అలా చేయలేరు. మీ ప్రజలు చనిపోతున్నారు. మీ సైనికులు తగ్గిపోయారు. మాతో వస్తే బయటపడే చక్కని అవకాశం ఉంది. కాల్పుల విరమణకు అంగీకరిస్తే మీ సైనికులు ప్రాణాలతో మిగులుతారు" అంటూ ట్రంప్ చెప్పుకొచ్చారు. దీనికి జెలెన్‌స్కీ బదులిస్తూ 'మేము మా దేశంలో ఉంటున్నాం. బలంగా ఉన్నాం. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఒంటరిగానే ఉన్నాం' అని స్పష్టంచేశారు. తమ సైనిక సాయం లేకపోతే ఈ యుద్ధం రెండువారాల్లోనే ముగిసిపోయేదని ట్రంప్ వ్యాఖ్యానించగా, మూడురోజుల్లోనే ఆగిపోతుందని పుతిన్ కూడా అన్నారంటూ జవాబిచ్చారు. దీంతో ఆగ్రహం చెందిన ట్రంప్ "మీరు ఒప్పందం చేసుకోకపోతే మేం వైదొలగుతాం. అప్పుడు మీరే పోరాడాలి. మీరు కృతజ్ఞతాపూర్వకంగా ఉండడం లేదు. అది బాగాలేదు. చాలా చూశాం. ఇక మీరు వెళ్లవచ్చు. ఇదో గొప్ప టెలివిజన్ షో అవుతుంది" అంటూ సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించారు.

నిఘా డ్రోన్ కూల్చివేత

న్యూఢిల్లీ: పంజాబ్‌లోని జలంధర్ వద్ద నిఘా డ్రోన్‌ను కూల్చివేసినట్టు అధికారులు తెలిపారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పలు చోట్లు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్టు డిప్యూటీ కమిషనర్ వెల్లడించారు. శకలాల దగ్గరికి ప్రజలు వెళ్లొద్దని సూచించారు. ప్రజలు ప్రశాంతంగా ఉండాలని కోరారు. బాణసంచా పేల్చొదని సూచించారు. భయందోళలు సృష్టించేందుకు ప్రయత్నించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మా యుద్ధ విమానం ధ్వంసమైంది నిజమే: పాక్

ఇస్లామాబాద్: భారత్ యుద్ధ విమానాలు జరిపిన దాడిలో తమ ఫైటర్ జెట్ విమానం ఒకటి దెబ్బతిన్నట్టు ఆ దేశ మిలిటరీ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే అది ఏ విమానం, ఎంత మేరకు నష్టం జరిగింది తదితర వివరాలు వెల్లడించలేదు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పలు పాకిస్థానీ జెట్ విమానాలను విజయవంతంగా నేలకూల్చి తీవ్ర నష్టాన్ని కలిగించినట్టు భారత్ ప్రకటించిన క్రమంలో ఎట్టకేలకు పాకిస్థాన్ తమకు నష్టం జరిగిన విషయాన్ని అంగీకరించింది.

కిరానా హిల్స్‌పై దాడి చేయలేదు

- వార్తలను ఖండించిన ఐఏఎఫ్

న్యూఢిల్లీ, మే 12: పాకిస్థాన్‌లో అణ్వాయుధ కేంద్రంగా చెబుతున్న కిరానా హిల్స్‌పై తాము దాడి చేయలేదని భారత వైమానిక దళం సోమవారం స్పష్టం చేసింది. కిరానా హిల్స్‌పై భారత్ దాడి చేసిందని సామాజిక మాధ్యమంలో విస్తృతంగా జరుగుతున్న ప్రచారంపై ఎయిర్‌మార్షల్ ఏకే భారతి మాట్లాడుతూ 'మేము కిరానా హిల్స్‌పై ఎలాంటి దాడి చేయలేదు. అక్కడ ఏముందో మాకు తెలియదు. మేమైతే దాడి చేయలేదు. అయితే అక్కడ అణ్వాయుధ కేంద్రం ఉందని చెప్పినందుకు ధన్యవాదాలు' అని ఆయన చెప్పారు. కిరానా కొండలు పాకిస్థాన్ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఒక రిజర్వేషన్ ప్రాంతంగా ప్రసిద్ధి చెందాయి. అక్కడి పర్వతాలలోని గుహలలో అణ్వాయుధాలను నిల్వ చేసి ఉంచారని నిఘా వర్గాలు భావిస్తున్నాయి.

కొలిక్కిరాని కొత్త డైరెక్టర్ల నియామకం

- విద్యుత్తు సంస్థల్లో ఏడాదిగా సాగతీత
- ఇంటర్వ్యూలు పూర్తయినా పెండింగ్
- విద్యుత్తు సంస్థల్లో గాడితప్పిన పాలన

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యుత్తు సంస్థలకు కొత్త డైరెక్టర్ల నియామకం సీరియల్‌ను తలపిస్తున్నది. ఏడాది నుంచి కొలిక్కి రావడమే లేదు. ఎట్టకేలకు గత నెలలో డైరెక్టర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలను మాత్రం పూర్తిచేశారు. ఇక అంతా అయిపోయింది. అర్హర్లు రావడమే తరువాయి అన్నట్టుగా ప్రచారం జరిగింది. ఆ తర్వాత ఏమయ్యిందో కాని నెల గడిచినా కొత్త డైరెక్టర్ల నియామకం జరగనేలేదు. ఆ అంశాన్ని పెండింగ్‌లో పెట్టేశారు. సాగదీతలు, సాచివేతలతో సర్కారు కాలం వెల్లదీస్తున్నది. రాష్ట్రంలో టీజీ ట్రాన్స్‌కో, టీజీ జెన్‌కో, టీటీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ సంస్థల్లో కొత్త డైరెక్టర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం 2024 జనవరిలో నోటిఫికేషన్‌ను జారీచేసింది. ఆశావాహుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. 91 మంది 152 దరఖాస్తులను సమర్పించారు. ఆ తర్వాత జరిగిన ఇంటర్వ్యూలకు కొందరు అనర్హులను పిలిచారన్న ఆరోపణలు వచ్చాయి. దీని వెనుక భారీ ఎత్తున నగదు చేతులు మారిందన్న ప్రచారం జరిగింది.

తొలగింపులపై తాత్సారం

విద్యుత్తు సంస్థల్లో డైరెక్టర్లుగా కొనసాగుతున్న రిటైర్డ్ ఉద్యోగులందరినీ 2025 మార్చి 31లోగా తొలగించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీంతో పాత వారి స్థానంలో కొత్త వారిని నియమిస్తారని అంతా అనుకున్నారు. కానీ, విద్యుత్తు సంస్థల్లో డైరెక్టర్లుగా కొనసాగుతున్న రిటైర్డ్ ఉద్యోగులను తొలగించనేలేదు. పైగా కొత్త డైరెక్టర్లను నియమించనూలేదు. ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావును ప్రభుత్వం తాజాగా ఈఆర్సీ సభ్యుడిగా నియమించింది. దీంతో ఈ పోస్టు ఖాళీ అయింది. ట్రాన్స్‌కో ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ జగత్‌రెడ్డి ఇటీవలే రాజీనామా చేశారు. గతంలో ఓ ఇద్దరు డైరెక్టర్లు రాజీనామా చేశారు. ప్రస్తుతం ఉన్న డైరెక్టర్లకే అదనపు బాధ్యతలను అప్పగిస్తూ వస్తున్నారు. దీంతో విద్యుత్తు సంస్థల్లో పాలన గాడితప్పింది. క్షేత్రస్థాయిలో సిబ్బందికి అనేక సమస్యలు నిత్యం ఎదురవుతున్నాయి.

కొవిడ్ మృతుల సంఖ్యను తగ్గించి చూపించారా?

- 2020లో కన్నా 2021లో మరణాలు 21 లక్షలు ఎక్కువ

న్యూఢిల్లీ : మన దేశంలో కొవిడ్ మృతుల సంఖ్య తగ్గించి చూపించినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2021లో 3.32 లక్షల మంది కొవిడ్‌తో మరణించినట్టు ప్రభుత్వం తెలిపింది. బుధవారం విడుదలైన సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ నివేదిక ప్రకారం కొవిడ్ మరణాల సంఖ్యను తగ్గించి చూపించినట్టు స్పష్టమవుతున్నది. ఈ నెల 9న కేంద్ర ఆరోగ్య శాఖ డ్యాష్‌బోర్డ్‌లో కొవిడ్‌తో 5.33 లక్షల మంది మరణించినట్టు తెలిపింది. పరిశోధకుల అంచనా ప్రకారం 4-12 రెట్లు ఎక్కువ! సీఆర్ఎస్ 2021 లెక్కల ప్రకారం 2020లో 81.15 లక్షల మంది మరణించారు, 2021లో 1.02 కోట్ల మరణాలు నమోదయ్యాయి. అంటే 2020లో కన్నా 2021లో ఈ సంఖ్య 21 లక్షలు ఎక్కువ.

ఫోన్ కాల్ తో పీఎఫ్ బ్యాలెన్స్ వివరాలు

నిబంధనలు సడలించిన ఈపీఎఫ్‌వో

న్యూఢిల్లీ : ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) సేవలు మరింత సులభతరం అయ్యాయి. ఈపీఎఫ్ ఖాతాదారులు తమ ఖాతా వివరాలను తనిఖీ చేసుకోవాలని కోరుకున్న ప్రతిసారీ కార్యాలయాన్ని లేదా ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను సందర్శించవలసిన అవసరం లేదు. మిస్డ్ కాల్ చేసి లేదా ఎస్ఎంఎస్ పంపించి, ఖాతా బ్యాలన్స్‌ను చెక్ చేసుకోవచ్చు. ఈ సేవలు ఉచితం, వినియోగించుకోవడం సులభం, స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ యాక్సెస్ లేకపోయినప్పటికీ ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ సేవలను వినియోగించుకోవాలంటే, ముందుగా, ఖాతాదారు పీఎఫ్ ఖాతా యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్) క్రియాశీలం (యాక్టివ్)గా ఉండాలి. బ్యాంకు ఖాతాకు లేదా ఆధార్ నంబరుకు లేదా పాన్ నంబరుకు యూఏఎన్ అనుసంధానం అయి ఉండాలి. ఈపీఎఫ్ఓ పోర్టల్‌లో యూఏఎన్ నంబరుతో ఖాతాదారు మొబైల్ నంబరు కూడా తప్పనిసరిగా నమోదై ఉండాలి.

మిస్డ్ కాల్ సేవలు

మిస్డ్ కాల్ సేవను పొందాలంటే, 9966044425 ఫోన్ నంబరుకు రిజిస్టర్డ్ మొబైల్ నంబరు నుంచి మిస్డ్ కాల్ ఇవ్వాలి. రెండుసార్లు రింగ్ అయిన తర్వాత తనంతటతానే కాల్ డిస్కనెక్ట్ అవుతుంది. తర్వాత టెక్స్ట్ మెసేజ్ వస్తుంది. తాజా ఈపీఎఫ్ కంట్రిబ్యూషన్, ప్రస్తుత పీఎఫ్ బ్యాలన్స్ వివరాలు ఈ మెసేజ్‌లో ఉంటాయి. ఈ సేవలు రోజుకు 24 గంటలు, వారానికి 7 రోజులు పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉంటాయి.

ఎస్ఎంఎస్ సేవలు

రిజిస్టర్డ్ మొబైల్ నంబరు నుంచి "EPFOHO UAN" అని టైప్ చేసి 7738299899 ఫోన్ నంబరుకు ఎస్ఎంఎస్ పంపించాలి. తాజా పీఎఫ్ కంట్రిబ్యూషన్, ప్రస్తుత పీఎఫ్ బ్యాలన్స్ వివరాలతో సమాధానం వస్తుంది.

ప్రాంతీయ భాషలో...

ఎస్ఎంఎస్ సేవలను ప్రాంతీయ భాషల్లో కూడా పొందవచ్చు. ఎస్ఎంఎస్ మెసేజ్‌లో యూఏఎన్ తర్వాత ప్రా